లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎంపీలు

ఖమ్మం, డిసెంబర్ 13: బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఎంపీ నామా నాగేశ్వరరావు నేతృత్వంలో బీఆర్ఎస్ ఎంపీలు బుధవారం న్యూఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన కొత్తా ప్రభాకర్‌రెడ్డి మెదక్ పార్లమెంట్ సభ్యుడి స్థానానికి రాజీనామా చేశారు. ఆ రాజీనామా లేఖను ఎంపీ నామా సమక్షంలో లోక్‌సభ స్పీకర్‌కు అందించారు. పార్టీ ఎంపీలంతా కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో స్పీకర్‌ను సత్కరించారు.

గృహిణి ఆత్మహత్య

పెనుబల్లి, డిసెంబర్ 13 : అనారోగ్య సమస్యలు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండాలపాడులో బుధవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన భోగి భవాని (31) భర్త రమేశ్ ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏడాది నుంచి భవాని అనారోగ్యానికి గురికాగా చికిత్స చేయించినా ఆరోగ్యం మెరుగుపడడం లేదని ఇంట్లో ఉన్న కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి వీ.ఎం.బంజర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

సత్తుపల్లి, డిసెంబర్ 13 : వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి కారుమంచి గోపాల్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తేజ కళాశాల ఒకేషనల్ విద్యార్థులు తోటి స్నేహితుడి కోసం రూ.5500 స్నేహితుడి తండ్రికి బుధవారం అందించారు.

రేపు దివ్యాంగులకు ఆటల పోటీలు: డీడబ్ల్యూవో

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 13: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల15న దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూవో) టి.సుమా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. జూనియర్స్ (10 – 17 ఏళ్లు), సీనియర్స్ (17 – 35 ఏళ్లు)కు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అంధులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, దివ్యాంగులకు రన్నింగ్, చెస్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, క్యారమ్స్, వీల్‌ఛైర్, ట్రైసైకిల్, బుద్ధిమాంద్యం దివ్యాంగులకు రన్నింగ్, చెస్, షాట్‌పుట్, క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు తమను సంప్రదించాలని సూచించారు.

డీసీసీబీ సీఈవోకు ఉద్యోగ సంఘ నాయకుల సన్మానం

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 13: డీసీసీబీ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ ఉర్ రహమాన్‌కు ఉద్యోగ సంఘం నేతలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేందర్ ఆధ్వర్యంలో బుధవారం నూతన సీఈవోను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సీఈవోను కలిసిన వారిలో సంఘం నాయకులు రామస్వామి, ఎం.రామకృష్ణ, ఓం ప్రకాశ్, ఉపేంద్రయ్య, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి : ఎమ్మెల్యే

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 13 : ఇటీవల తుపాను కారణంగా రామానగరం–గంగారం గ్రామాల మధ్య రోడ్డు తెగిపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం అక్కడకు వెళ్లి తెగిన రోడ్డును పరిశీలించి మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగించేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, సైదులు, సురేశ్, సాయిలు, చెన్నారావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, ఆర్‌అండ్‌బీ, ఐబీ అధికారులు ఉన్నారు.

తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కిడ్నీ బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

సత్తుపల్లి, డిసెంబర్ 13 : పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన ఏముల లక్ష్మి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్డీవో అశోకచక్రవర్తి అమ్మమ్మ వేల్పుల సమాధానం మృతిచెందగా ఆమె భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి అర్పించి కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గొత్తికోయల సమస్యల పరిష్కారానికి కృషి

పెనుబల్లి, డిసెంబర్ 13 : చౌడవరం అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న గొత్తికోయల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. చౌడవరంలో బుధవారం ఆమె స్థానిక గిరిజనులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి జిల్లా మంత్రుల సహకారంతో కృషి చేస్తానన్నారు. అనంతరం ఇటీవల వర్షాలకు ధ్వంసమైన రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం ధ్యేయం : ఎమ్మెల్యే

వైరారూరల్, డిసెంబర్ 13 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. వైరా మండలం గన్నవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, వేమిరెడ్డి విజయలక్ష్మి, కోటారెడ్డి, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏడి బాబురావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దళారులను నమ్మి మోసపోవద్దు

పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న ఏఎంసీ సిబ్బంది

కారేపల్లి, డిసెంబర్ 13 : దళారుల బారిన పడి రైతులు మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కేంద్రం వద్ద తెల్లబంగారు కొనుగోళ్ల జోరు కొనసాగుతున్నది. మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లు ప్రాంగణంలో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ అనుబంధంగా గత నెల 18న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇల్లెందు ఏఎంసీ స్పెషల్ గ్రేడ్ అధికారి ఎర్రి నరేశ్‌కుమార్ బుధవారం సీసీఐ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతులు నేరుగా కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువచ్చి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, కిరణ్‌పురోహిత్, రాకేష్‌కుమార్, రంజిత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ అందిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

గంగారం పీహెచ్‌సీ సేవలు భేష్

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 13 : గంగారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సేవలు భేష్ అని డిప్యూటీ డీఎంహెచ్‌వో తలారి సీతారాం అన్నారు. బుధవారం ఆయన పీహెచ్‌సీని సందర్శించి మండల వైద్యుడు ఆర్.అవినాశ్, సిబ్బందిని అభినందించారు. అనంతరం బాలింతకు ఆయన న్యూట్రిషన్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రమీలా రాణి, నరసింహారావు, సులోచన, పీహెచ్‌ఎన్ అన్నమ్మ పాల్గొన్నారు.

నీలాద్రి ఆలయంలో పోలీసుల పూజలు

నీలాద్రిలో పూజలు చేయిస్తున్న పోలీసు అధికారులు

పెనుబల్లి, డిసెంబర్ 13 : కార్తీకమాసం చివరిరోజు పురస్కరించుకొని ప్రముఖ క్షేత్రమైన నీలాద్రిశ్వర ఆలయంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్వంచ ఏసీపీ ఎన్.వెంకటేశ్, అశ్వారావుపేట సీఐ పీ.కరుణాకర్ ఆలయాన్ని దర్శించుకోగా ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గర్భగుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం అటవీ ప్రాంతంలో గలకోతులకు ప్రత్యేకమైన ఆహారాన్ని అందించారు.

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 13 : బేతుపల్లి భువనేశ్వరి సమేత గౌతమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పాడ్యమి సందర్భంగా స్వామివారికి మహా న్యాసపూర్వక రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు చేశారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయండి

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 13 : అంగన్‌వాడీ సెంటర్ల వద్ద నిర్మాణాలు చేపట్టిన మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో జయరామ్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని కిష్టాపురం, తుంబూరు, తాళ్లమడ గ్రామాల్లో పర్యటించిన ఆయన అంగన్‌వాడీ కేంద్రాల వద నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

కేజీబీవీని సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు

రికార్డులు పరిశీలిస్తున్న ప్రొఫెసర్ రవికాంత్

కారేపల్లి, డిసెంబర్ 13 : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు ప్రొఫెసర్ రవికాంత్ బుధవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. 1 నుంచి 5 తరగతులకు తొలిమెట్టు, 6 నుంచి 9వరకు ఉన్నతి, 10వ తరగతి వారికి లక్ష్యం అనే అంశంపై గతంలో రాష్ట్ర, జిల్లాలు, మండలాలు, పాఠశాలల వారీగా శిక్షణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు ప్రభాకర్‌రెడ్డి, జగదీశ్, ఎంఈవో జయరాజు, పాఠశాల ప్రత్యేకాధికారి ఝాన్సీసౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉద్యానశాఖ అధికారికి వినతి

కొణిజర్ల, డిసెంబర్13 : పామాయిల్‌తోటల్లో అంతర్‌పంట సబ్సిడీను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ఉద్యానశాఖ అధికారి అనసూయకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తెలంగాణ రైతుసంఘం బృందం కలిసి పామాయిల్ రైతుల సమస్యలు వివరించారు. నాయకులు మాదినేని రమేశ్, ఎస్.కే.మీరా, చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, దొండపాటి నాగేశ్వరరావు, రాధాకృష్ణ, పాషా, తాళ్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తల్లాడ, డిసెంబర్ 13 : కుర్నవల్లి ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా కుర్నవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. కుర్నవల్లి, ముద్దునూరు, కలకొడిమ, రంగాపురం, కేశవాపురం, పుణ్యపురం, బస్వాపురం గ్రామాల వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సోలార్ లైట్లు ధ్వంసం

వైరా టౌన్, డిసెంబర్ 13 : వైరా రిజర్వాయర్ ఆనకట్టపై గుర్తు తెలియని ఆకతాయిలు సోలార్ లైట్లను పగలగొట్టారు. నీటిపారుదలశాఖ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని దుండగులు ఆకతాయిలు వైరా రిజర్వాయర్ ఆనకట్టపై ఇటీవల రూ.34లక్షల వ్యయంతో నిర్మించిన సుమారు ఐదారు సోలార్ లైట్లను పగులగొట్టారు. నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 13 : ఢిల్లీలో ఈ నెల 17 నుంచి జరగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయానికి చెందిన గుమ్మడి దల ఉదయ్ కిరణ్ ఎంపికయ్యాడు. బుధవారం ఇక్కడ అభినందన సభ నిర్వహించి పాఠశాల యాజమాన్యం రూ.2 వేలు, తెలుగు పండితుడు రామిశెట్టి వెంకటరమణమూర్తి రూ.1000 ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో విశ్వశాంతి కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

తల్లాడ, డిసెంబర్13 : వైరా జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ భర్త లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటమని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME
I, **RAMPYARE PASSI** S/o. Ramcharan (old name), R/o.H.NO. D-444, Rudrampur Village, Chunchupally Mandal, Bhadradri Kothagudem District, Telangana - 507119,TS. Changed my father name from **RAMCHARAN** to **MANGLI PASSI.** Hence forth, I shall be called as **RAMPYARE PASSI** S/o. **MANGLI PASSI** (NEW NAME) for all purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.